సాక్షి
విశాఖపట్నం
గురువారం । 25 । జనవరి । 2024



5వేల మందికి వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం 5వేల మందికి వైద్య సేవలందించారు. 10లో



రాజ్యాంగానికి న్యాయ వ్యవస్థ సహకారం 10లో



నిస్వార్థ సేవలకు గుర్తింపు 10లో

'గణ'గణమంటున్న అసమ్మతి స్వరం!

- గణబాబుపై టీడీపీలో తిరుగుబాటు
- వ్యవహారశైలిపై మండిపడుతున్న నేతలు, కార్యకర్తలు
- ఎమ్మెల్యేగా ఏనాడూ ప్రజల పక్షాన కానరాని వైనం
- గెలిచిన తర్వాత నాలుగున్నరేళ్లు ఇంటికే పరిమితం
- తన కలల సౌధం నిర్మాణానికే ప్రాధాన్యం



సాక్షి, విశాఖపట్నం : మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడు.. ఆ నియోజకవర్గాన్ని ఏ స్థాయిలో అభివృద్ధి చేయాలి.? ప్రజల బాగోగుల్ని ఎంత చక్కగా చూసుకోవాలి. గెలిపించిన కార్యకర్తలకు ఏ విధంగా అండగా నిలవాలి. ఇవేమి పట్టని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుపై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగురవేశారు. ఆయన్ను ఇంక భరించలేమనీ.. నియోజకవర్గం నుంచి సాగనంపాలంటూ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. ప్రజా సమస్యలపై పనిచేయడం లేదని బాహాటంగా విమర్శలు గుప్పించారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, టీడీపీ చోడవరం పరిశీలకుడు మూర్తి యాదవ్‌తో పాటు ఆ నియోజకవర్గ నాయకులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గానికి గణబాబు భారంగా మారారని, ఆయనకు టికెట్ ఇవొద్దని డిమాండ్ చేశారు. సొంతంగా అభివృద్ధి చెందారే తప్ప.. పార్టీ నేతలను, ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదంటూ ధ్వజమెత్తారు.

సొంత ప్రయోజనాల కోసమే..

2019 ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత గణబాబు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భాలు వేళ్లపై లెక్కపెట్టుకోవచ్చు. తమ కష్టాలు తీర్చాల్సిన ఎమ్మెల్యే.. కనీసం కనిపించడం లేదంటూ ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో భయభ్రాంతులకు గురి చేసిన ఎల్‌జీ పాలిమర్స్ ఘటన సమయంలోనూ ఇంటికే పరిమితమైపోవడంతో ప్రజలకు ఆయనంటే పూర్తిగా విరక్తి కలిగింది. నియోజకవర్గంతో సంబంధం లేకపోయినా వివిధ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు ఆ ప్రాంతంలో పర్యటించి.. బాధిత ప్రజలకు ఏం కావాలో దగ్గరుండి.. వారికి బాసటగా నిలిచారు. చివరికి ఆ ఘటనను రాజకీయం చేసేందుకు విశాఖకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వచ్చినా.. ఆయన్ని తీసుకొచ్చేందుకు విమానాశ్రయానికి సైతం రాకుండా ఇంటికే పరిమితమైపోవడంతో.. పార్టీ శ్రేణుల్లోనూ గణబాబుపై వ్యతిరేకత అప్పటి నుంచే మొదలైంది.

ప్రభుత్వ ఆస్తులు సొంతానికి..

ఎమ్మెల్యేగా ప్రజలకు ఏ మేలూ చేయని గణబాబు.. ప్రభుత్వ ఆస్తులను సొంత పనులకు వాడుకున్నారన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీలో వివిధ విభాగాలకు చెందిన వాహనాల్ని ఎమ్మెల్యే హోదాలో తన సొంత పనులకు వినియోగించుకున్నారన్న ఆరోపణలున్నాయి. గోపాలపట్నంలో ఉన్న జీవీఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సైతం సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారంటూ గతంలో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తాళాలను శాప్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంచరపాలెం సమీపంలో రైల్వే నిధులతో అండర్ పాసేజ్ నిర్మిస్తే.. తానే నిర్మించానంటూ హడావుడి చేయడంపైనా విమర్శలు చెలరేగాయి. రెవెన్యూ స్థలాన్ని కొంత మేర ఆక్రమించి గోపాలపట్నంలో తనకు చెందిన నరసింహ థియేటర్‌ను నిర్మించారన్న ఫిర్యాదులూ గణబాబుపై ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ప్రజల అవసరాల్ని గాలికొదిలేసి.. నాలుగేళ్లుగా తన స్థలంలో భారీగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌పైనే దృష్టిసారించారంటూ స్వయంగా టీడీపీ నేతలు విమర్శలు గుప్పించడం నియోజకవర్గంలో చర్చకు దారితీసింది.

మంచినీటి ప్రాజెక్టుకూ మోకాలడ్డు

తనకు ఓటేసి గెలిపించిన నలుగురికి మంచి జరుగుతుందంటే.. తన జేబులో డబ్బులు ఖర్చయినా ఫర్వాలేదనుకుంటారు ఏ ఎమ్మెల్యే అయినా. కానీ.. గణబాబు రూటు మాత్రం సెపరేటు. మూడేళ్ల క్రితం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.336 కోట్ల నిధులతో నార్త్‌వెస్ట్ ఏరియాకు నిరంతర మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పైప్‌లైన్ పనులు చురుగ్గా సాగుతున్న సమయంలో ఎమ్మెల్యే గణబాబు ఎంటర్ అయ్యారు. నాయుడుతోట, ఆకుల గౌతమ్‌నగర్ కాలనీ, సాయి మాధవ్ నగర్ సమీపంలో బీఆర్‌టీఎస్ రోడ్డు వెంబడి జరుగుతున్న ఈ నీటి సరఫరా పనులు వెంటనే నిలిపేశారు. పైప్‌లైన్ వేసే ప్రాంతంలో తనకు చెందిన స్థలాలుండటంతో 400 శాతం టీడీఆర్‌లు ఇచ్చేంతవరకూ పనులు జరిపేది లేదంటూ తన పార్టీ నేతల్ని రెచ్చగొట్టి పనులు నిలిపేసే వరకు వ్యవహారాలూ నడిపారు. ఇలా.. అమ్మ పెట్టదు.. అడుక్కు తిననివ్వదు అన్న చందాన.. తానూ అభివృద్ధి చేయకుండా.. ప్రభుత్వం చేస్తున్న మంచిని సైతం అడ్డుకునేందుకు సైతం వెనకాడని గణబాబు మాకొద్దంటూ టీడీపీ నేతలు పట్టుబడుతూ తిరుగుబావుటా ఎగరేశారు. గణబాబుకి టికెట్ ఇస్తే.. ఓడించి తీరుతామంటూ ప్రతినబూనుకోవడం గమనార్హం.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



మాట్లాడుతున్న మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జీవీఎంసీ స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 33 అజెండాలతో పాటు 20 టేబుల్ అజెండాలు పొందుపరిచారని, వీటిని స్థాయీ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారన్నారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి లీజుల క్రమబద్ధీకరణ, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి పలు ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపునకు రూ.9.96 లక్షలు, ప్రజారోగ్యా విభాగానికి సంబంధించి పలు వార్డుల్లో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికుల నియామకానికి రూ.36.52 లక్షలు, స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా 51, 41 వార్డుల్లో 24 కమ్యూనిటీ మరుగుదొడ్ల ఆధునికీకరణకు రూ.33.83 లక్షలు, పారిశుధ్య కార్మికుల యూనిఫాం కోసం రూ.65.98 లక్షలు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.11.35 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందన్నారు. కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శాంతిరాజు, మత్స్యరాజు, సంతోషికుమారి, రమణమూర్తి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విశాఖలో మ్యాచ్‌కు జైషాకు ఆహ్వానం



జైషాను ఆహ్వానిస్తున్న ఏసీఏఏసీ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా జరగనున్న భారత్–ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి రావాలంటూ బీసీసీఐ కార్యదర్శి జైషాను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్(ఏసీఏ ఏసీ) అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి ఎస్‌ఆర్ గోపినాథరెడ్డి ఆహ్వానించారు. మంగళవారం బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న జైషాను ఆహ్వానించగా, సముఖత వ్యక్తం చేశారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రలో నిర్వహిస్తున్న క్రికెట్ కార్యకలాపాలపై చర్చించారు. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు వైఎస్‌ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లో విశాఖ క్రికెటర్ కేఎస్ భరత్ జట్టులో స్థానం సంపాదించాడు.

జిందాల్‌కు ఉక్కు ఉత్పత్తుల సరఫరా



రేక్ ద్వారా జిందాల్‌కు ఉత్పత్తుల సరఫరా ప్రారంభిస్తున్న ఇరు సంస్థల అధికారులు

ఉక్కునగరం: జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ చేసుకున్న ఒప్పందం అమలు ప్రారంభమైంది. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ తయారు చేసిన ఉత్పత్తులను బుధవారం సరఫరా చేసింది. స్టీల్‌ప్లాంట్ అవసరమైన ముడి పదార్థాలను సరఫరా చేసే సంస్థకు కొంత మేర ప్లాంట్ ఉత్పత్తులు సరఫరా చేయాల్సి ఉంది. జిందాల్‌తో చేసుకున్న ఎంవోయూ మేరకు ప్లాంట్ సీడీవై యార్డ్ నుంచి ఉత్పత్తులను అంగుల్‌లో ఉన్న జిందాల్ కంపెనీకి రేక్ ద్వారా తరలించారు. సీడీవై యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ సీజీఎం(వర్క్స్) ఎ.కె.సోఫ్టీ, జిందాల్ ప్రతినిధులు, స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు షాక్

విశాఖ సిటీ: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కోర్టు షాకిచ్చింది. నగరంలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 83 మందికి రూ.3.18 లక్షలు జరిమానా విధించింది. అలాగే ఒకరికి 21, ముగ్గురికి 7 రోజుల జైలు శిక్ష విధించింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చేసిన తనిఖీల్లో గోపాలపట్నం, పెందుర్తి, మల్కాపురం, మహారాణిపేట, టూటౌన్, పోర్ట్ టౌన్, ద్వారకా, స్టీల్ ప్లాంట్, కంచరపాలెం, గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలలో 83 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వీరికి రూ.3.18 లక్షలు జరిమానాతో పాటు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరికి 21 రోజులు, ఇద్దరికి 7 రోజులు జైలు శిక్ష విధించారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.54.06 లక్షలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో గత నెల 30 నుంచి ఈ నెల 24వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. సాధారణ హుండీల ద్వారా రూ.54,06,435 నగదు రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ.1,00,253 సమకూరింది. 76.100 గ్రాముల బంగారం, 1.410 కేజీల వెండి రాగా.. 423 అమెరికా డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్‌కు చెందిన ఒక దినార్ వచ్చింది. ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రవాస భారతీయురాలి ఉదారత

కేజీహెచ్ కార్డియాలజీకి పలు పరికరాల అందజేత



కేజీహెచ్‌కు పరికరాలు అందజేస్తున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాధ

మహారాణిపేట: ప్రవాస భారతీయురాలు, అమెరికాకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాధ తన ఉదారతను చాటుకున్నారు. కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి చీరాల ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షలు విలువ చేసే కార్డియాక్ క్రాష్ కార్ట్ మెషీన్, ఈసీజీ, డీఫిబ్రిలేటర్, ఏఈడీ పరికరాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ, వారి కుటుంబ సభ్యులకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. డీసీఎస్‌ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, కేజీహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమమాలిని, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి

సాక్షి, అనకాపల్లి: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ.. రేంజ్ ఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలు, విశాఖ సిటీలో ముగ్గురు, విజయనగరంలో ముగ్గురు, శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి లభించింది. సీఐడీలో నాలుగు, ఇంటలిజెన్స్ విభాగంలో ఏడుగురు, ఏపీ ట్రాన్స్‌కోలో ఒకరు, రైల్వేలో ఇద్దరు, మెరైన్‌లో ఒకరు, ఏసీబీలో పనిచేస్తున్న ఓ ఎస్‌ఐకి సీఐలుగా పదోన్నతి దక్కింది.

బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య ప్రభుత్వ సంబంధాలే..

- పార్టీ సంబంధాలు లేనేలేవు
- షర్మిలకు రాష్ట్ర అభివృద్ధి చూపించేందుకు సిద్ధంగా ఉన్నాం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీకి, వైఎస్సార్‌సీపీ మధ్య ప్రభుత్వ సంబంధాలు మాత్రమే ఉన్నాయని, రాజకీయ సంబంధాలు లేనే లేవని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. బుధవారం ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నాయి.. తమ మధ్య రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు మాత్రమే చర్చకు వస్తాయన్నారు. గతంలో ఏయూలో నిర్వహించిన బహిరంగ సభలోనే రాష్ట్ర ప్రయోజనాలే తప్ప వేరే అవసరాలు లేవని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తేల్చి చెప్పారన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రైల్వే జోన్ మంజూరు చేయాలని ఆ సభలోనే కోరిన విషయాన్ని గుర్తు చేశారు. దావోస్‌లో జరిగిన పారిశ్రామిక సదస్సుకు హాజరు కాలేదంటూ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించగా, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దావోస్ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. గత ఏడాది విశాఖలో ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించి, భారీ ఎత్తున పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు.

సవాల్ స్వీకరిస్తున్నాం..

రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమా? అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని, రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏమిటో జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే చూపించారని అమర్‌నాథ్ చెప్పారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో నిర్మించిన మెడికల్ కాలేజీలు, భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట పోర్టు, అదానీ డేటా సెంటర్, గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు వారికి కనిపించలేదా? ఇది అభివృద్ధి కాదా? వీటన్నింటి పైన చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అమర్‌నాథ్ స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసిన కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పుడు శత్రువుగానే చూస్తారని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలకు నెట్‌వర్క్ సౌకర్యం మరింతగా పెంచేందుకు జియో సంస్థ ఏర్పాటుచేసిన 250 టవర్స్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారని చెప్పారు.

అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా

- జిల్లాలో ఆసరా వారోత్సవాలు ప్రారంభం
- నాలుగు విడతల్లో రూ.711 కోట్ల రుణమాఫీ
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



పీఎంపాలెంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్/మహారాణిపేట/మధురవాడ: వైఎస్సార్ ఆసరా పథకం.. డ్వాక్రా అక్కచెల్లెమ్మల మోములో వెలుగు పూలు పూయిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ.. నాలుగున్నరేళ్లకు పైబడిన పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తూ వస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా అమలు చేసిన ఈ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. దీంతో పాటు స్త్రీనిధి ద్వారా వచ్చిన సొమ్మును జమ చేసుకుని పలు వ్యాపారాలు చేసుకుంటూ.. కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.

స్వయం సహాయక సంఘాల మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించేలా ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' పథకానికి రూపకల్పన చేశారు. పొదుపు సంఘాల్లో మహిళలు తీసుకున్న రుణాలను విడతల వారీగా పూర్తిగా మాఫీ చేశారు. తాజాగా మంగళవారం నాలుగో విడత నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి జిల్లాలో ఆసరా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. భీమిలి నియోజకవర్గ పరిధి 4, 6 వార్డుల్లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. గురువారం 5వ వార్డు, 28న ఉత్తర నియోజకవర్గం, 29న పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు, 30న విశాఖ దక్షిణ నియోజకవర్గం, గాజువాక, 31న పెందుర్తి, అనకాపల్లిలో సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు యూసీడీ పీడీ కేవీ పాపునాయుడు తెలిపారు.

రుణమాఫీ ఇలా..

జిల్లా వ్యాప్తంగా పొదుపు సంఘాలు	25,387
మొత్తం సభ్యులు	2,59,214
మూడు విడతల్లో చేసిన మాఫీ	రూ.533.53 కోట్లు
నాలుగో విడతలో చేసిన మాఫీ	రూ.177.52 కోట్లు
జీవీఎంసీ పరిధిలో పొదుపు సంఘాలు	22,475
మొత్తం సభ్యులు	2,26,573
మూడు విడతల్లో చేసిన మాఫీ	రూ.452.25 కోట్లు
నాలుగో విడతలో చేసిన మాఫీ	రూ.150.75 కోట్లు

టీడీపీ హయాంలో మోసం

టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగింది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. దీంతో మహిళలు రుణాలు చెల్లించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన బాబు హామీ ఊసే ఎత్తలేదు. చేసేది లేక మహిళలు చేసిన అప్పుకు వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి తలెత్తింది. అప్పు కోసం బ్యాంకర్ల ద్వారా వేధింపులకు గురయ్యారు. తిరిగి 2019 ఎన్నికల సమయంలో మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు బాబు కొత్త పన్నాగం పన్నారు. ఎన్నికల సమయంలో తాయిలాలుగా పసుపు కుంకుమ కింద నగదు అందజేసి చేతులు దులుపుకున్నారు. ఇది గ్రహించిన డ్వాక్రా మహిళలు ఎన్నికల్లో బాబును దూరం పెట్టారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మహిళలంతా ఎంతో ధైర్యంగా ఉన్నారు. నా భర్త టైలర్. ఏ రోజు ఆదాయం ఆ రోజుకు సరిపోయేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత మా పరిస్థితి మారింది. ఆర్థికంగా తోడ్పాటు లభించింది. ఆయనకు కృతజ్ఞతలు. మళ్లీ ఆయనే సీఎం కావాలి.

– షేక్ చాంద్‌బీ, ఆర్‌హెచ్ ముస్లిం కాలనీ

క్లుప్తంగా

5వేల మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం నగర పరిధిలోని ముత్యాలమాంబ కాలనీ, చినముషిడివాడ, కణితి, దేవాడ, శివనగర్, భవానీగార్డెన్స్, నరసింహనగర్, ప్రసాద్‌గార్డెన్స్, దొండపర్తి, విద్యానగర్, దండుబజార్(రెండు చోట్ల)లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ శిబిరాలను డీఎంహెచ్‌వో సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ శిబిరాల్లో మొత్తం 5వేల మందికి వైద్య సేవలందించామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. గురువారం పిఠాపురం కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, ఎన్‌జీజీవో కాలనీ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోట, నరసింహనగర్, లంకెలపాలెం, గాజువాక, బుచ్చిరాజుపాలెంలో శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్ కార్మిక సమ్మె వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈనెల 29, 30 తేదీల్లో తలపెట్టిన కార్మిక సమ్మె వాయిదా పడింది. సెయిల్‌లో వేతన ఒప్పందం ప్రక్రియ పూర్తి కాకపోవడంపై కార్మిక సంఘాలు కేంద్ర కార్మిక శాఖకు ఫిర్యాదు చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 29, 30 తేదీల్లో సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. సమ్మె అంశంపై కేంద్ర కార్మిక శాఖ చీఫ్ లేబర్ కమిషనర్ బుధవారం ఇరువర్గాలతో సమావేశం ఏర్పాటు చేశారు. డిమాండ్లపై కేంద్ర కమిషనర్ సెయిల్ యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. కార్మిక సంఘాలతో చర్చలు కొనసాగించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా యాజమాన్యానికి తగిన వ్యవధి ఇవ్వాలని కార్మిక సంఘాలకు సూచించారు. ఆయన సూచనల మేరకు కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెను వాయిదా వేయడానికి అంగీకరించారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు

40 మంది పోలీసులకు అవార్డుల ప్రదానం


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన


అవార్డులు స్వీకరించిన పోలీసులతో వీసీ ప్రసాదరెడ్డి, వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్, సీపీ రవిశంకర్

ఏయూక్యాంపస్: అవార్డులు.. పోలీసుల అందించే నిస్వార్థ సేవలకు, విశాఖ నగరానికి గుర్తింపు తీసుకువస్తాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బుధవారం నగర పోలీసులకు అత్యుత్తమ ప్రదర్శన పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అవార్డులు.. ఇతరులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. పోలీసు కమిషనర్ నగర పౌరుల భద్రతకు తీసుకున్న చర్యలు, చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు వారికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి గుర్తింపును కోరుకోని వ్యక్తులుగా పోలీసులు నిలుస్తున్నారని.. వీరి సేవలను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నావికాదళం వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్ మాట్లాడుతూ పోలీస్ వృత్తిలో ఉండే వారు ధైర్యం, కరుణ, సమర్థత అనే లక్షణాలను కలిగి ఉండాలన్నారు. సమాజం కోసం పోలీసులు వారి వ్యక్తిగత జీవితాలను త్యాగం చేస్తారని, వారిని గౌరవించడం మనందరి బాధ్యత అని అన్నారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ ఎంతో నిబద్ధతతో.. అవిశ్రాంతంగా పోలీసులు సేవలు అందిస్తున్నారన్నారు. వారికి తగిన గుర్తింపు, గౌరవం లభించకపోవడం తాను గమనించానన్నారు. సంక్లిష్ట పరిస్థితుల్లో సైతం సమర్థ సేవలను అందిస్తూ, సమన్వయం చేస్తున్నారన్నారు. తన పరిధిలో 600 మందికిపైగా మహిళా పోలీసులు తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. వీరిలో స్ఫూర్తిని నింపుతూ మరింత మెరుగైన సేవలు అందించే విధంగా ఈ పురస్కారాలు అందిస్తున్నట్లు వివరించారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలను అరికట్టడం, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను నివారించడం లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 11 విభాగాలకు చెందిన 40 మంది పోలీసులు, నలుగురు ప్రాసిక్యూషన్ సిబ్బందికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. నారాయణ పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన నృత్యం.. సమాజానికి మహిళ అందిస్తున్న సేవలు, ఆమె విలువను చాటింది. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) వెంకటరత్నం, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


హాజరైన పోలీసులు

బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు-2023

ఉత్తమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
ప్రథమ స్థానం: పెందుర్తి, జి.రమేష్, సబ్ ఇన్‌స్పెక్టర్
ద్వితీయ స్థానం: గాజువాక, ఆర్.వి. సత్యనారాయణ రెడ్డి, ఇన్‌స్పెక్టర్

ఉత్తమ ట్రాఫిక్ నిర్వహణ
ప్రథమ స్థానం: కె.ఎస్.వి.ఎస్.ప్రసాద్, సీఐ ద్వారకా
ద్వితీయ స్థానం: కె.లక్ష్మి, ఎస్ఐ, టూటౌన్ ట్రాఫిక్

ఉత్తమ విచారణ అధికారి
ప్రథమ స్థానం: సి.హెచ్.వివేకానంద, ఏసీపీ
ద్వితీయ స్థానం: టి.ఇమ్మాన్యుయల్ రాజు, సీఐ

ఉత్తమ సహాయక విచారణాధికారి
ప్రథమ స్థానం: డి.కిశోర్‌బాబు ఏఎస్ఐ, ఎంవీపీ క్రైం
ద్వితీయ స్థానం: టి.శ్యాంసుందరరావు, దిశ హెచ్‌సీ

ఉత్తమ మహిళా పోలీస్
ప్రథమ స్థానం: రాజన్న భవాని
ద్వితీయ స్థానం: కందల సత్యవేణి

ఉత్తమ కోర్ట్ క్రాఫ్ట్ అండ్ ప్రాసిక్యూషన్
ప్రథమ స్థానం: టి.వాణి, పీపీ
ద్వితీయ స్థానం: ఎం.ఆదినారాయణ ఏపీపీ

బెస్ట్ ఇన్ కలెక్షన్ ఆఫ్ ఇంటెలిజెన్స్
ప్రథమ స్థానం: బి.వి.ప్రభాకర్, ఏఎస్ఐ
ద్వితీయ స్థానం: బి.ప్రసాదరావు, హెచ్‌సీ

ఉత్తమ క్రైం పోలీస్‌స్టేషన్
ప్రథమ స్థానం: ఎంవీపీ క్రైం, ఒ.సురేష్‌కుమార్, ఎస్ఐ
ద్వితీయ స్థానం: భీమునిపట్నం క్రైం సూర్యప్రకాశరావు, ఎస్ఐ

ఉత్తమ శాంతి భద్రతల పోలీస్ స్టేషన్
ప్రథమ స్థానం: పీఎంపాలెం, వై.రామకృష్ణ, సీఐ
ద్వితీయ స్థానం: కంచరపాలెం, ఎస్.సాయి, సీఐ

బెస్ట్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం: పి.షణ్ముఖరావు, ఏఆర్‌హెచ్‌సీ
ద్వితీయ స్థానం: ఎస్.శ్రీనివాసరావు, బీడీ టీమ్

ఉత్తమ హోంగార్డ్
ప్రథమ స్థానం: రేసపు సరస్వతి, మహారాణిపేట ట్రాఫిక్
ద్వితీయ స్థానం: అలమండ దామోదరరావు, భీమిలి క్రైం

రాజ్యాంగానికి న్యాయ వ్యవస్థ సహకారం

సబ్బవరం: రాజ్యాంగానికి న్యాయవ్యవస్థ సహకారంపై దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సెమినార్ నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయ సూర్య అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో ×రాజ్యాంగ న్యాయ శాస్త్రానికి భారత న్యాయ వ్యవస్థ సహకారం - ఇటీవలి పరిణామాల్లు అనే అంశంపై ఒక రోజు సెమినార్ బుధవారం నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయ సూర్య ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

జస్టిస్ జయసూర్య మాట్లాడుతూ ఇటువంటి సెమినార్లను న్యాయ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నల్సార్ వ్యవస్థాపక వీసీ ప్రొఫెసర్ డాక్టర్ రణబీర్ సింగ్, గోవాలోని ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వెంకటరావు ప్రధాన వక్తలుగా పాల్గొని తమ సందేశాన్ని వినిపించారు. గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు సదస్సును ప్రారంభించి, అతిథులను సత్కరించారు. హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక వీసీ, ఢిల్లీ నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ రణబీర్ సింగ్ మాట్లాడుతూ ఆర్టికల్ 21 ప్రాధాన్యతను వివరించారు. పౌరులంతా గౌరవ ప్రదమైన జీవితాన్ని కొనసాగించేందుకు సుప్రీంకోర్టు అనేక రకాలుగా ఆర్టికల్ 21ను నిర్వచించిందని తెలిపారు. సమాజంలోని అట్టడుగు వర్గాలను ఉద్ధరించడంలో ప్రగతిశీల న్యాయశాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, న్యాయ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్‌లో భారత్ మరింత అభివృద్ధి

విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్


విద్యార్థినికి జ్ఞాపిక అందిస్తున్న కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్

మల్కాపురం: భవిష్యత్‌లో భారతదేశం మరంత అభివృద్ధి చెందుతుందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్ అన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో 59వ వార్డు ములగాడ మండల పరిధిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీధరన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో భారత్ మరింత ప్రగతి సాధించి 2047 నాటికి ప్రపంచంలో మూడో స్థానంలో నిలుస్తుందన్నారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, జోన్ - 5 జెడ్సీ ఆర్‌జీ వీ.కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ నాయకులు కాశీవిశ్వనాథ్, పోలిమేర శ్రీనివాస్‌రావు, దిలీప్‌వర్మ, దాడి పురుషోత్తం, విజయబాబు పాల్గొన్నారు.

పక్క రాష్ట్రం వారే బాబు స్టార్ క్యాంపెయినర్లు

- సీఎం వైఎస్ జగన్ దళితుల పక్షపాతి
- 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటే నిదర్శనం
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి


సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

డాబాగార్డెన్స్: టీడీపీ అధినేత చంద్రబాబుకు చాలా మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని, వారంతా పక్క రాష్ట్రంలోనే ఉంటారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. డాబాగార్డెన్స్‌లోని కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, బాబు వదిన, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, తదితరులు చంద్రబాబు స్టార్ క్యాంపెయినర్లని చెప్పారు. ఎంత మంది కూటమిగా వచ్చినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. వైఎస్ జగన్ దళితుల పక్షపాతి అనడానికి నిదర్శనం.. విజయవాడ నడిబొడ్డులో కోట్ల విలువైన స్థలంలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రూ.400 కోట్లతో నిర్మించి జాతికి అంకితం చేయడమేనన్నారు. దేశంలోనే నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పి సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. మేధావి అంబేడ్కర్‌కు అరుదైన గౌరవాన్ని ఇవ్వాలని, ఆలోచించి దానిని ఆచరణలో పెట్టి ప్రపంచమంతా నివ్వెరపోయేలా వైఎస్ జగన్ చేసి చూపించారన్నారు. చంద్రబాబు తన పాలనలో పెత్తందారి వ్యవస్థకు, తన సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదల పక్షాన నిలబడి, వారి ఉన్నతికి దోహదపడ్డారన్నారు. ఈ సమావేశంలో కె.రాజారావు, అమల్ దాస్ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

తగరపువలస: కొత్త మూలకుద్దుకు చెందిన ఆర్మీ ఉద్యోగి కొయ్య రమణ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి ఎల్లయ్య భీమిలి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గంటా హరీష్ దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల సెలవుపై వచ్చిన రమణ మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఉండవచ్చని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. భార్య తో ముందు రోజు గొడవ కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని తెలిపారు.

ఏడీసీ సన్యాసిరావుకు గౌరవం

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన జీవీఎంసీ ఏడీసీ వి.సన్యాసిరావుకు అరుదైన గౌరవం లభించింది. ఆయనకు గవర్నర్ విందులో పాల్గొనే అవకాశం దక్కింది.

అప్పనంగా డేటా ఇచ్చేస్తున్నాం

- మన సమాచారాన్ని మనమే లీక్ చేస్తున్నాం
- సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి
- ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్


మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్

ఏయూక్యాంపస్: భవిష్యత్‌లో సైబర్ యుద్ధాలు పెనుసవాళ్లుగా మారతాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. సీబీడీ విభాగం ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జరుగుతున్న సైబర్ నేరాలపై రెండు రోజుల అవగాహన సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వైఖరులు మన భవిష్యత్‌ను ప్రభావితం చేస్తాయన్నారు. కొన్ని సందర్భాల్లో వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లను చూసి మనం ఆశపడితే.. దాని వెనుక జరిగే మోసం మనకు ఆవేదన కలిగిస్తుందన్నారు. మనం ఉపయోగించే వివిధ యాప్‌లు మన సమాచారాన్ని ఎలా సంగ్రహిస్తున్నాయి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆదాయ పన్నుల శాఖ ఉన్నతాధికారి మూర్తి నాయక్ మాట్లాడుతూ మన సమాచారాన్ని విభిన్న మార్గాల్లో ఇతరులకు చేరుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. సీబీఐ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మురళీ రాంబ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ దాడులను ఎదుర్కొంటున్న దేశాల్లో భారత్ రెండవ స్థానంలో ఉందన్నారు. బ్యాంకర్ల నిర్లక్ష్యం భారీ నేరాలకు దారితీస్తున్న విధానాన్ని పలు ఉదాహరణలతో వివరించారు. కంప్యూటర్ అక్షరాస్యత అధికారులకు ఎంతో అవసరమన్నారు. తాత్కాలిక విధానంలో పని చేసే సిబ్బంది యూజర్ నేమ్, పాస్‌వర్డ్ వంటివి షేర్ చేయకూడదన్నారు. సరళమైన పాస్‌వర్డ్‌లు ఉంచడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. సాంకేతిక నిపుణుడు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ బ్యాంక్‌కి సైబర్ సెక్యూరిటీ పాలసీ ఉంటుందని, దీనిని తెలుసుకోవాలని సూచించారు. కంప్యూటర్‌లో వినియోగించే యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను నిత్యం అప్‌డేట్ చేయాలన్నారు. పాస్‌వర్డ్‌లను తరచూ మార్పు చేసుకోవాలన్నారు. ఓటీపీ, సీవీవీ నంబర్, ఏటీఎం కార్డ్ నంబర్, పిన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్ వంటివి గోప్యంగా ఉంచాలన్నారు. సీబీడీ అడిషనల్ ఎస్పీ ఎంవీ రవివర్మ మాట్లాడుతూ మన నిర్లక్ష్యం, అతిగా విశ్వాసం చూపడం కొన్ని సందర్భాల్లో ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎస్‌బీఐ డీజీఎం పంకజ్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలు, దాడులను నిలువరించడం సాధ్యపడుతుందన్నారు. బ్యాంక్ సిబ్బంది, వినియోగదారుల్లో అవగాహన పెంచాలని సూచించారు. సదస్సులో భాగంగా ఉదయం వివిధ బ్యాంక్‌ల అధికారులకు, మధ్యాహ్నం వివిధ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జనసేన నాయకుల ద్వంద్వ రాజకీయం

- 22వ వార్డులో 20 ఏళ్లుగా ఉన్న బడ్డీల తొలగింపునకు గతంలో కుట్ర
- 17వ వార్డులో అనధికారిక బడ్డీలు తొలగించొద్దంటూ తాజాగా నిరసన
- అధికారులు, పోలీసులతో ఆ పార్టీ నాయకుల వాగ్వాదం


17వ వార్డులో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు


22వ వార్డులో జనసేన నాయకులు కూలగొట్టించిన బడ్డీలు(ఫైల్)

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గంలో జనసేన నాయకులు ద్వంద్వ రాజకీయానికి తెరలేపుతున్నారు. ప్రజలకు మంచి చేస్తున్నట్లు ఒక పక్క బిల్డప్ ఇస్తూనే.. మరోపక్క చిరు వ్యాపారుల నడ్డివిరిచేందుకు కుట్రలు పన్నుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం వారు పాకులాడుతున్న తీరు పలు వార్డుల్లో చర్చనీయాంశంగా మారింది. 17వ వార్డు ఉషోదయ కూడలిలోని పలు అనధికారిక బడ్డీల తొలగింపు విషయంలో మరోసారి జనసేన, టీడీపీ నాయకుల కుతంత్రం బయటపడింది. ఈ కూడలిని ఆనుకొని రోడ్డుకు ఇరువైపులా అనధికారిక బడ్డీలు ఉన్నాయి. ప్రస్తుతం నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ పరిధిలోని 17వ వార్డులోను ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఉషోదయ కూడలి ఆధునికీకరణ పనులతో పాటు ఇక్కడి నుంచి టీటీడీ కూడలి వరకు ఫుట్‌పాత్‌లు నిర్మించాల్సి ఉంది. ఇందులో భాగంగా ఉషోదయ కూడలిలోని బడ్డీలను తొలగించాలని చాలా కాలంగా అక్కడి వ్యాపారులకు జీవీఎంసీ అధికారులు సూచిస్తున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలోను ఆయా బడ్డీలను తొలగించేందుకు చర్యలు చేపట్టగా.. వారు సమయం కావాలని కోరడంతో అవకాశం ఇచ్చారు. అయితే ఆయా వ్యాపారులు కోర్టుకు వెళ్లడంతో ఫుట్‌పాత్ నిర్మాణం కొద్ది నెలలుగా నిలిచిపోయింది. రోడ్డుతో పాటు గానే ఫుట్‌పాత్‌ను నిర్మించాల్సి ఉన్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. దీంతో కోర్టులో జీవీఎంసీ తన వాదనలు సైతం వినిపించింది. గత రెండు రోజుల పాటు బడ్డీల తొలగింపు విషయాన్ని అక్కడి వ్యాపారులకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో బుధవారం బడ్డీలు తొలగింపునకు చర్యలు చేపట్టింది. ఇదే అదనుగా రాజకీయ లబ్ధి పొందాలని భావించిన జనసేన, టీడీపీ నాయకులు రంగంలోకి దిగారు. జీవీఎంసీ అధికారులు, పోలీసులతో వాగ్వాదం చేశారు.

ఇదేం నీతి?

ఈ ఘటనపై నిరసనకు దిగిన జనసేన నాయకుడు శ్రీనివాస్ పట్నాయక్, టీడీపీ నాయకుడు కాళ్ల శంకర్ తీరుతో ద్వంద్వ వైఖరి మరోసారి బయటపడింది. 22వ వార్డు పిఠాపురం కాలనీలో 20 ఏళ్లుగా ఉంటున్న బడ్డీలను తొలగించాలంటూ జనసేన పార్టీ నాయకులు జీవీఎంసీపై గతంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితుల తరఫున నిలిచినా జీవీఎంసీ అధికారులు వైఎస్సార్‌సీపీకి కొమ్ముకాస్తున్నారంటూ స్థానిక జనసేన కార్పొరేటర్ ఆరోపణలు చేశారు. దీంతో ఒత్తిడి నేపథ్యంలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది.. అక్కడ బడ్డీలను తొలగించాల్సి వచ్చింది. అయితే తాజాగా 17వ వార్డులో రోడ్డు ఆధునికీకరణలో భాగంగా ఫుట్‌పాత్ నిర్మాణం కోసం బడ్డీలు తొలగిస్తుంటే జనసేన నాయకులు అక్కడికి చేరుకుని హడావుడి చేయడం అందరినీ విస్మయానికి గురిచేసింది. పక్క వార్డులో బడ్డీల తొలగింపు విషయంలో క్రియాశీలకంగా మారిన వారు.. ఈ వార్డులో తొలగించొద్దంటూ అధికారులతో వాగ్వాదానికి దిగడంతో చిరు వ్యాపారులు గందరగోళానికి గురయ్యారు. రాజకీయ లబ్ధి కోసమే ఇలా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ పలువురు అభిప్రాయపడ్డారు.

న్యాయ సేవ ప్రాధికార సంస్థ తీర్పులు శాశ్వతం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్


సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఇచ్చే తీర్పులు శాశ్వతమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. బుధవారం సాయంత్రం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇరువర్గాలు అంగీకరిస్తే న్యాయ సేవా సంస్థ శాశ్వత తీర్పులు అందిస్తుందన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని పేర్కొన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బాలిక దినోత్సవం సందర్భంగా వారి హక్కులు, సాధికారత, విద్య, సామాజిక న్యాయం వంటి అంశాలను విపులీకరించారు. శాశ్వత ప్రజా న్యాయ పీఠం అధ్యక్షులు, న్యాయమూర్తి జి.వల్లభ నాయుడు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, బీమా కంపెనీలు, బ్యాంకులు, తపాలా శాఖ, ప్రభుత్వ రంగ సంస్థలు కేసుల విచారణకు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. సత్వర న్యాయం పొందడానికి సంస్థ నిరంతరం సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సమాంతర న్యాయ సేవకులు, న్యాయవాదులు, ప్రభుత్వ రంగ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అధ్యక్షత వహించారు.